### బీదలబస్తీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో...

## కనుల పండువగా అమ్మవారి కల్యాణం



బీదలబస్తీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో జరిగిన అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సికింద్రాబాద్,డిసెంబర్ 4:బీదలబస్తీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.సీతాఫల్ మండి డివిజన్ పరిధిలోని బీదల బస్తీలో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో జమదగ్ని,రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీ ఎం మల్లేష్,వీ జే శేషగిరిరావు,గడ్డం ప్రసాద్,జీ సత్యనారాయణ,శ్రీనివాస్,జీఎం శ్రీకాంత్,యశ్వంత్ ,నానిలు తదితరలు పాల్గొన్నారు.

### నిరాశ్రయులకు అన్నదానం



సికింద్రాబాద్, డిసెంబర్ 4: సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న అనాథలకు అన్నదాన ప్యాకెట్లను పంపిణీ చేశారు.సీతాఫల్ మండికి చెందిన సంఘ సేవకుడు బంగారి సాయి కృష్ణ చలి కాలం కావడంతో సికింద్రాబాద్ పరిధిలో రోడ్లపై ఉన్న నిరాశ్రయులకు ఆదివారం రాత్రి ఆహార్ల పొట్లాలను పంపిణీ చేశాడు.

### అభినందనలు



అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పద్మారావును నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. –ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4



సికింద్రాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో పద్మారావుగౌడ్ మెజార్టీతో విజయం సాధించడంతో సోమవారం దీటి మల్లయ్య,రాష్ట్ర గంగపుత్ర సంఘం నాయకులు కైరంకొండ యాదగిరి తదితరులు సికింద్రాబాద్ టకారాబస్తీలోని ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. – సికింద్రాబాద్,డిసెంబర్4:



### ముగిసిన శతచండీ మహాయాగం

బంజారాహిల్స్ రోడ్డు నంబర్14లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి దేవాలయంలో నిర్వహించిన శత రుద్రయాగ సహిత శతచండీ మహాయాగం సోమవారం ముగిసింది. చివరిరోజు చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం అనంతరం ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు.– బంజారాహిల్స్, డిసెంబర్ 4

## ఎన్ఆర్ఎస్ హాస్టల్లో నాగుపాము



ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎన్ఆర్ఎస్ హాస్టల్‌లో సోమవారం నాగుపాము కనిపించింది. హాస్టల్ ప్రవేశద్వారంలోనే పడగ విప్పి తిష్టవేయడంతో విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. ఇటీవల హాస్టల్‌లోకి పాములు రావడం సాధారణమైపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హాస్టల్ గదుల్లోకి పాములు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సేవకురాలిగా పనిచేస్తా..

### కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే లాస్యనందిత

- **కలిసొచ్చిన సంక్షేమ పథకాలు, సాయన్నను మరువని జనం**



కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న లాస్యనందిత, చిత్రంలో ఎమ్ఎన్ శ్రీవివాసారావు, గజ్జెల నగేశ్, నివేదిత

కంటోన్మెంట్, డిసెంబర్ 4: హైదరాబాద్ జిల్లా నుంచి కొత్తగా అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతుంది. కంటోన్మెంట్ అభ్యర్థి గ్యాని లాస్యనందిత తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. దివంగత ఎమ్మెల్యే సాయన్న అకాల మరణాన్ని నియోజకవర్గ ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో సాయన్నపై సానుభూతితో పాటు బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లాస్యనందిత గెలుపునకు దోహదపడ్డాయి.

**తొలి ప్రయత్నంలోనే గెలుపు..**

కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన గ్యాని లాస్యనందిత తొలి ప్రయత్నంలోనే విజయాన్ని దక్కించుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న సాయన్న అకాల మరణంతో బీఆర్ఎస్ అధిష్ఠానం సాయన్న కూతురు లాస్యనందితను బరిలోకి దింపింది. తొలి ప్రయత్నంలోనే లాస్యనందిత ఎమ్మెల్యేగా విజయం సాధించారు. లాస్యనందితకు 59,057 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి శ్రీ గణేశ్‌కు 41,888 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెలకు 20,826 ఓట్లు దక్కాయి. లాస్యనందిత 17,169 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగరేశారు.

**అందుబాటులో ఉంటూ..**

'నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవకురాలిగా పనిచేస్తా. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా, ప్రజా సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తానని' ఎమ్మెల్యే గ్యాని లాస్యనందిత పేర్కొన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు, తన గెలుపు కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన లాస్యనందితకు శుభాకాంక్షలు తెలిపి సెల్ఫీ దిగుతున్న పార్టీ శ్రేణులు



### లాస్యనందిత విజయోత్సవ సంబురాలు



ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్యనందితకు శుభాకాంక్షలు తెలుపుతున్న నియోజకవర్గ మహిళలు



కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్యనందితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తదితరులు



కుటుంబ సభ్యులతో కలిసి సంబురాలు జరుపుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్యాని లాస్యనందిత